

చింతపల్లి క్రీడా ప్రాంగణం



నెల్కివెంకటాపూర్ క్రీడా ప్రాంగణం



ముత్యంపేట క్రీడాప్రాంగణం

వరి కల్లాలుగా... క్రీడా ప్రాంగణాలు

దండేపల్లి: మండలంలోని క్రీడా ప్రాంగణాలు చాలా చోట్ల గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో వాటిని క్రీడాకారులు ఏమాత్రం వినియోగించుకోకపోవడంతో, అవి చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. వరికోతలు ముమ్మరంగా సాగడంతో ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు లేకపోవడంతో, ఎక్కడ ఖాళీ ప్రదేశాలు కనిపిస్తే చాలు వాటిని రైతులు కల్లాలుగా వినియోగిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలు కల్లాలు లేని రైతులకు కల్లాలుగా ఉపయోగపడుతున్నాయి. అలాంటి దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

గాలివీస్తే కరెంట్ కట్..!



బెల్లంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్

- కొమ్మ తాకినా.. చినుకు రాలినా విద్యుత్ సరఫరాలో అంతరాయం
- అడ్డగోలు కోతలతో ప్రజల అవస్థలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి విద్యుత్ డివిజన్‌లో అకాల వర్షాలు, గాలి దుమారం విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. వారం రోజుల నుంచి వరుసగా రోజువారీగా గాలి దుమారం వీయడం, వడగళ్ల వర్షాలు కురవడం పరిపాటిగా మారింది. పగలు తీవ్రమైన ఎండ కాచి, చీకటి పడటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటం, అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వర్షం దంచి కొడుతోంది. ఏమాత్రం గాలి వీచినా, చినుకులు రాలినా కరెంట్ సరఫరా నిలిచిపోవడం సాధారణ తంతుగా మారింది. ఒక్కసారి కరెంట్ పోతే గంటల సమయం గడిస్తే కానీ పునఃరుద్ధరణ జరగడం లేదు. వేసవి కాలంలోనే ఈ తీరైన ప్రతికూల పరిస్థితులు ఉంటే వర్షాకాలంలో మరెంతగా కరెంట్ ఇబ్బందులు పడాల్సి వస్తుందేమోనని విద్యుత్ వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు.

విద్యుత్ డివిజన్ పరిధిలో..

బెల్లంపల్లి విద్యుత్ డివిజన్ పరిధిలో ఏడు మండలాలు ఉన్నాయి. నెన్నెల, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, కాసిపేట, తాండూర్ మండలాలతో పాటు బెల్లంపల్లి మున్సిపల్, గ్రామాల ప్రజలకు బెల్లంపల్లి కేంద్రంగా విద్యుత్ సరఫరా జరుగుతుంది. కాల్‌టెక్స్ ఏరియాలో ఉన్న 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఆయా మండలాల్లో ఉన్న 33/11కేవీ సబ్‌స్టేషన్‌లకు కరెంట్ సరఫరా చేయడానికి ప్రత్యేక విద్యుత్ లైన్ వేశారు. ఆ కరెంట్ లైన్‌ల కింద, పక్కన ఏపుగా ఎదిగిన వృక్షాలు ఉండి వాటి కొమ్మలు కరెంట్‌తీగల పైకి ఎగబాకుతుండటంతో ఏమాత్రం గాలి వీచినా తీగలకు తగలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. అటవీ ప్రాంతం మీదుగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం ఆటంకంగా మారగా, మరో పక్క ఎప్పటికప్పుడు ట్రీకటింగ్ పనులు నిర్వహించడంలో నిర్లక్ష్యం జరుగుతోంది.

మెరుగైన విద్యుత్ కరువు..

గాలి దుమారం వీచి అడ్డగోలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది.మున్సిపాలిటీలో మెరుగైన విద్యుత్ సరఫరా జరగడం లేదు. ఇక గ్రామీణ ప్రాంతాల పరిస్థితి వేరే చెప్పనక్కరలేదు.పల్లెల్లో ఒక్కసారి కరెంట్ పోతే పునఃరుద్ధరణకు గరిష్టంగా 7,8 గంటలు వేచి చూడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండకపోవడంతో ప్రైవేట్ సిబ్బందిపై ఆధారపడి కరెంట్ సరఫరా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వినియోగదారులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా కరెంట్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా, సరిగ్గా అమలు జరగకపోవడం శాపంగా మారింది. ఇప్పటికైనా విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

చెట్ల కొమ్మలు విస్తరించడంతోనే..

విద్యుత్ లైన్ల వెంట చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి విస్తరించి ఉన్నాయి. కొన్నిచోట్ల మామిడి, ఎర్రచందనం, సుబాబుల్ తోటలు ఉండగా, మరికొన్ని చోట్ల తుమ్మ ఇతర రకాల వృక్షాలు పెరిగాయి. వీటి కొమ్మలను ఏటా మూడుసార్లు కటింగ్ చేయిస్తున్నాం. ఫలసాయాన్నిచ్చే వృక్షాల జోలికి వెళ్లడం లేదు. గాలివీచినా ప్రతిసారి చెట్ల కొమ్మలు తీగలపై వాలి కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఏమాత్రం జాప్యం చేయకుండా పునఃరుద్ధరణ చర్యలు తీసుకుంటున్నాం.

– రాజన్న, విద్యుత్ శాఖ డీఈ, బెల్లంపల్లి



దండేపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమశాతం 17లోపు వచ్చేవరకు ఆరబెట్టాలి. దీంతో ధాన్యం ఆరబోస్తూ, కుప్పలు చేస్తూ అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కొంతమంది రైతులు, రైతు కూలీలు పొద్దంతా కుప్పల వద్దే కాపలా ఉంటూ, అక్కడే ఆకలి తీర్చుకుంటున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



పనులు పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

భీమారం: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. భీమారం మండల కేంద్రంలో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక అధికారులకు సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కార్యదర్శులే పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ప్రజల నుంచి వసూళ్లు చేయాల్సిన పన్నులు వెంటనే వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూధన్, ఎంపీవో సతీష్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చెన్నూర్ మండల ప్రత్యేకాధికారిగా డీపీవో

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండల ప్రత్యేకాధికారిగా జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి రవికృష్ణ మండల ప్రత్యేకాధికారిగా పని చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టారీతిన తమ అనుచరులకే ఇళ్లు మంజూరు చేస్తున్నారని మండిపడ్డారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయకుండా వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన నిరుపేదలను గుర్తించి, వారికి ఇళ్లు మంజూరయ్యేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బట్వాన్‌పల్లి, పెర్కపల్లి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అశోక్ గౌడ్, సత్తయ్య, వినోద్, ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్, హరికృష్ణ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అపోహలు వద్దు'



మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు ఎలాంటి అపోహలు కలిగి ఉండొద్దని బెల్లంపల్లి మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో పి.హరికృష్ణ అన్నారు. మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. నిరుపేదలకు గూడు సౌకర్యం కల్పించడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు విడతల వారీగా మంజూరవుతాయని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కారుకూరి రాంచందర్, ఎంపీడీవో మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భరత్, భూమయ్య, మహేశ్, మాజీ సర్పంచ్ స్వరూప, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.


ఈజీఎస్ పనుల పరిశీలన



గడ్డపారతో తవ్వుతున్న ఎంపీడీవో

భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఎంపీడీవో మధుసూధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో కూలీలకు నీటిసదుపాయంతో పాటు నీడ ఏర్పాటును కొనసాగించాలని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. గడ్డపారతో తవ్వి పనితీరు పరిశీలించారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ నక్కరాజన్న తదితరులు పాల్గొన్నారు.


ఉపాధిహామీ పనులు ఉపయోగకరంగా ఉండాలి



పనులు పరిశీలిస్తున్న రేంజ్ అధికారి

జన్నారం: ఫారెస్ట్‌లో ఉపాధిహామీ పథకం కింద చేస్తున్న పనులు అడవి అభివృద్ధి, వన్యప్రాణులకు ఉపయోగకరంగా ఉండాలని ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇందన్‌పల్లి రేంజ్‌లో, ఇందన్‌పల్లి బీట్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించారు. వర్షాలకు నీరు వృథా పోకుండా ఇక్కడే ఇంకిపోయేలా కందకాల తవ్వకాల పనులు చేయాలన్నారు. కుంటల నిర్మాణం, ఇతరత్రా పనులు వన్యప్రాణులకు ఉపయోగకరంగా ఉండాలని సూచించారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణ, వన్యప్రాణ చట్టాలపై కూలీలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట సెక్షన్ అధికారి రవి, సిబ్బంది ఉన్నారు.

క్షయ నివారణపై ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

వేమనపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద టీబీ సూపర్‌వైజర్ అశోక్ ఆధ్వర్యంలో క్షయ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. 45మందికి తెమడ పరీక్షలు, 56మందికి ఎక్స్‌రేలు తీశారు. కార్యక్రమంలో ఎల్‌టీ రాజమణి, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిబిరాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- డీఈవో యాదయ్య



వేసవి శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

చెన్నూర్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలుగు తీసేందుకు పాఠశాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిబిరాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 294మంది విద్యార్థులు ఉండగా వేసవి శిబిరానికి 30మంది విద్యార్థులు హాజరు కావడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈవో మాట్లాడుతూ.. ఉదయం 8 గంటల నుంచి 10:30గంటల వరకు విద్యార్థులకు నృత్యం, యోగా, ఆటలు, పాటలు, చిత్రలేఖనంలో శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతీ విద్యార్థికి నాణ్యమైన అల్పాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి, జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు'



బాధ్యతలు అప్పగిస్తున్న వెంకటేశ్వర్ గౌడ్

దండేపల్లి: బీజేపీలో పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ అన్నారు. బీజేపీ దండేపల్లి మండల అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన బందెల రవిగౌడ్‌కు గురువారం దండేపల్లి పార్టీ కార్యాలయంలో బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీకోసం అందరూ కలిసికట్టుగా పనిచేసి, మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రజాసమస్యలపై పోరాడి ప్రజల పక్షాన నిలిచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. పార్టీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజయ్య, గురువయ్య, ప్రభాకర్, రవీందర్, శేఖర్, సత్తయ్య, శ్రీనివాస్, మల్లేష్, సత్యనారాయణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా చర్యలు పాటించాలి

- జీఎం శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: కశ్మీర్ ఘటన నేపథ్యంలో దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా భద్రతా చర్యలు పాటించాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఆయన ఏరియా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసుల సూచనల మేరకు గనులపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఉద్యోగులు డ్యూటీకి వచ్చే సమయంలో తప్పనిసరిగా ఐడీ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. అనుమానితులు గనులు, డిపార్టుమెంట్ల పరిసరాల్లో సంచరిస్తే వెంటనే సెక్యూరిటీ డిపార్టుమెంట్‌కు తెలియజేయాలన్నారు. గుర్తు తెలియని వారు ఏవైనా పార్సిల్స్ ఇస్తే తీసుకోవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనలను పాటించాలన్నారు. ఈ విషయాలను గనులపై కార్మికులకు తెలియజేయాలని మేనేజర్లకు సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం(ఫైనాన్స్) భీబత్సా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఓసీపీ పీఓ ఏవీ రెడ్డి, ఏజెంట్లు కే రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, ఎస్ఈ చంద్రశేఖర్, ఎంవీటీసీ మేనేజర్ కే రామారావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

జన్నారం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న అన్నారు. ఎస్సీ ఎస్టీ టీఎఫ్ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచడంలో ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నానాటికి విద్యార్థులు నమోదు తగ్గుతుందని, విద్యార్థులు తగ్గితే ఉపాధ్యాయుల భవిష్యత్, ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఉపాధ్యాయుడు తనవంతుగా కనీసం పదిమంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చే కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన దుర్గం రాజలింగంను సన్మానించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, మండల అధ్యక్షుడు తుంగూరి గోపాల్, జిల్లా గౌరవ అధ్యక్షుడు జాడి ప్రభాకర్, రాష్ట్ర సహాధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రాథోడ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రదత్

పాతమంచిర్యాల: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ వ్యవస్థాపకులు ఫౌండర్ హెన్రీ డ్యూయంట్ జన్మదినాన్ని ప్రపంచ రెడ్‌క్రాస్ డేగా నిర్వహించడం జరుగుతుందని రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.మధుసూధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేసి హెన్రీడ్యూయంట్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆనంద నిలయంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు చంద్రదత్, సుగుణాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి చందూరీ మహేందర్, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, శంకర్ వర్మ, బుద్దార్థి సత్యనారాయణ, రక్తనిధి కేంద్రం సిబ్బంది మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస పద్మావతి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న జీఎం దంపతులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం శ్రీనివాస పద్మావతిల కల్యాణం ఆలయ నిర్వాహకులు ఘనంగా జరిపించారు. ఈ కల్యాణ తంతులో ఏరియా జీఎం దేవేందర్ స్వరూపరాణి, ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్ దంపతులతో పాటు 60జంటలు హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, నరసింహాచార్యులు, కృష్ణకాంతాచార్యులు మంత్రోత్సరణ నడుమ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

చెన్నూర్: ప్రభుత్వ ఆసుపత్రులలో విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్, హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ నాయకులు మహేశ్ అన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు పి.విజయ్‌కుమార్, స్వరూపరాణి, సుచరిత, సౌందర్య, కౌసల్య, సూపర్వైజర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి వెంకటాపూర్‌లో నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయనే అనుమానంతో పోలీసులు గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులకు నకిలీ విత్తనాలు వాడడం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు ఎస్సై గంగా రాం వివరించారు. నకిలీ పత్తి విత్తనాలు, గ్లైఫోసెట్ మందు అ మ్మకాలు, కొనుగోలు చేపడితే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సఖీ కేంద్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిరూరల్: సఖీ కేంద్రం అందించే సేవలను ప్రతీ మహిళా ఆపదలో సద్వినియోగం చేసుకోవాలని సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ శ్రీలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్‌లో గురువారం ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలు, వరకట్నం వేధింపులు, గృహహింస, శారీరక వేధింపులు, బాలికల అక్రమ రవాణ తదితర విషయాల్లో మహిళలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానం వచ్చినా సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో సైకో సోషల్ కౌన్సిలర్ జ్యోతి, కేస్ వర్కర్ లావణ్య, ఎంపీవో సత్యనారాయణ, ఈజీఎస్ ఏపీవో రజియా సుల్తానా తదితరులు ఉన్నారు.

తొలిసారి పామాయిల్ కొనుగోళ్లు

వేమనపల్లి: మండలంలో మొట్టమొదటిసారి రైతులు సాగు చేసిన పామాయిల్ పంట కోతకు వచ్చింది. అయిలవేణి మల్లేష్ అనే రైతు మూడు సంవత్సరాల క్రితం పామాయిల్ పంట సాగుకు శ్రీకారం చుట్టగా పంట పక్వానికి వచ్చింది. గురువారం మ్యాట్రిక్స్ కంపెనీ జిల్లా మేనేజర్ మురళీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు లింగాగౌడ్, కుర్రు వెంకటేషం, మాజీ సర్పంచ్‌లు రాంచందర్, గాలి మధు, నాయకులు గణపురం సంతోష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారుల దౌర్జన్యం నశించాలి

కోటపల్లి: మండలంలోని ఫారెస్టు అధికారుల దౌర్జన్యం నశించాలని బీజేపీ నాయకులు పెద్దింటి పున్నంచందు ఒక ప్రకటనలో తెలిపారు. పిన్నారం గ్రామంలోని సుంకె నగేశ్ అనే వ్యక్తి ఇంటిపై గురువారం ఫారెస్టు అధికారులు దాడి చేసి కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. గత సీజన్‌లో ఫారెస్టు భూమిలో ట్రాక్టర్‌తో చదునుచేశాడని ఫారెస్టు అధికారులు ఈరోజు ఇంటిపై వెళ్లి కుటుంబసభ్యులను ఇబ్బందులు పెట్టడమే కాకుండా, ట్రాక్టర్ టైర్‌లో గాలి తీయడం సబబుకాదన్నారు. వ్యక్తిగత కక్ష్యలతోనే ఫారెస్టు అధికారులు ఇలా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు.

నియామకం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన బోరే యాదగిరి నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిషరీస్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా నియామకమయ్యారు. ఈ పదవిలో 5సంవత్సరాల పాటు కొనసాగనున్నారు.